ప్రముఖాంధ్ర పదునెనిమిదవ వర్ష హర్ష సంచిక




# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

సెప్టెంబర్ 2012

సంపుటి : 18 (212) సంచిక : 9




## కర్మాచరణ చేయనివారెవ్వరూ భగవంతుని అనుగ్రహం పొందలేరు!

**- నిలువు దోపిడీలిచ్చినా, కోట్లాది విలువగల రత్నఖచిత స్వర్ణ కిరీటాలిచ్చినా దేవుడనుగ్రహించడు!! -**

**కులక్షయే ప్రణశ్వని కుల ధర్మాస్సనాతనః**
**ధర్మేనష్టే కులం కృత్స మధర్మోభిభవత్సతః**

భారత సనాతన ధర్మం సంఘంలో చీకాకులు లేకుండా ప్రశాంత జీవితాన్ని కడగంటా గడపడానికీ, పరస్పర సహాయోన్నత కల ఉపకారములు పొందడానికీ, గుణకర్మ విభాగంగా కొన్ని కర్మలను కొందరికి విభజిస్తూ వర్ణవ్యవస్థను ఏర్పరిచింది. జగద్గురువుల సాలోచన చేసి నిర్ణయించిన శాంతయుత, పరస్పర సహ జీవనమార్గం. విశ్వంలోని ఏ దేశంలోనూ వృత్తిగుణపరమైన సహకార, సన్నిహిత జీవిత మార్గాల నిర్ణయం జరుగలేదు. అన్యోన్యత అన్నదానికే స్థానం లేదు. అనుబంధం అన్నది అసలు లేదు. గాంధీగారి స్వాతంత్ర సముపార్జనా సహాయ నిరాకరణోద్యములో కూడా ఆంధ్రులు అందరూ ఒకటియై ఉద్యమానికి ఊతం యిచ్చారు. ఆయన పథకం ఫలించింది. హిందూ సమాజంలోని అన్ని వర్గాలవారూ, తమ తమ వృత్తులను వృత్తిధర్మంగా నిర్వహిస్తూ, స్వాతంత్ర్యోద్యమంలో సమష్టిగా పాల్గొన్నారు. గ్రామాల్లోని ప్రజలు బయటకు వెళ్ళే పని లేకుండా, గ్రామంలోనే పరిశ్రమలు కుటీర పరిశ్రమలుగా వర్ధిల్లడానికిదో చక్కని మార్గమని గాంధీజీ నుంచీ ఎందరో నేతలు అన్నారు. దీన్ని విస్మరిస్తే, వృత్తి జాతులకు అపార నష్టం కలుగుతుంది. గ్రామ సౌభాగ్యం కుంటుపడుతుందని తెలుసుకున్నారు.. ఇదే భగవద్గీతలో -

**దోషై రేతైః కులఘ్నూనానాం వర్ణసంకర కారకైః**
**ఉత్పాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః!**

- బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియాది విభాగాలు (వృత్తి వర్ణములు) ఒడిదుడుకులు లేని మనుగడకు సుఖ జీవనవృత్తులుగా, జాతిధర్మ జీవనమునకుపయోగపడునట్లు నిర్ణయింపబడినవి. ఒకరింట్లోని జననం నుంచీ మరణం వరకూ వచ్చు శుభా శుభకార్యములకు ఒకరికొకరుగా సహకరించే వృత్తివర్ణములుగా నెలకొనే బాధ్యతలీ వృత్తి ధర్మములమీద ఏర్పడినవి. ఈ వృత్తిపర వర్ణములకు కొన్ని కట్టుబాట్లు నేర్పరచబడినవి. జాతి ధర్మాలెట్టి సుఖభద్రానుభూతులు కల్పిస్తాయో, ఆయా వృత్తి ధర్మములు కూడా అటువంటి సుఖభద్రానుభూతులనే కలిగిస్తాయ్. వంశపరంపరగా వచ్చేవారికి ఆయా ధర్మనిపుణతలను వారి పెద్దలే నేర్పుతారు, లేదా అయాచితం గానూ అలవడుతాయి. వృత్తి సౌకర్యమునకు కారకులైన వారికి నియమభ్రష్ట దోషము కలిగిన ఫలితముగా ఆ జాతి కుల ధర్మములు రెండూ లోపించి భ్రష్టులవుతారు. జీవమనుగడ క్షీణించి, గ్రామ పౌరుల మధ్య రగడ ఏర్పడుతుంది. అందుకే జాతి కుల పెద్దలు కులవృత్తి సాంప్రదాయాలకు భిన్నముగా నుండు వారిని జాతి నుంచి వెలివేయడమనేవి ఆనాడు గ్రామ కట్టుబాటుగా ఉండేది. అందుచే వారు కుల ధర్మ కట్టుబాట్లను గౌరవించేవారు. గీతాచార్యులు కూడా కుల వర్ణాశ్రమ ఆచారాలను సంకరము చేసి, ధర్మభ్రష్టులైనవారు కుంభీపాక, రౌరవాది నరకముల పాలగుదురని హెచ్చరించడం జరిగింది.

కులవృత్తియనెడిది కర్మానుబద్ధంగా ఏర్పడింది. మనుష్యులందరూ ప్రకృతి జనితములైన (వృత్తి కులవృత్తులే అనుకోండి) గుణకర్మలకు లోబడి కర్మలు చేయుటకు బాధ్యులు కావలెను. జనకుని వంటి రాజన్యుడు కూడా కర్మలను విడనాడలేదు.

**కర్మణైవ హి సంసిద్ధమ్ ఆస్థితా జనకాదయః**
**లోక సంగ్రాహమే వాపి సంపశ్యన్ కర్తు మర్హసి!**

- రాజర్షి జనకుడాదిగల జ్ఞానులు గూడ ఆసక్తికరముగా కర్మలను ఆచరించుట వలన పరమసిద్ధిని పొందిరి అంటూ, గీతాచార్యుడైన శ్రీకృష్ణుడు - "నేను కూడా కర్మల నాచరించనిచో లోకము అల్లకల్లోలమగును. వనరులు నశించును. ప్రజానష్టము కలుగును - అన్నారు. జగదేకపూజ్యుడు వచించిన ఈ సత్యాన్ని దేశ పాలకవర్గంవారు, ప్రతిపక్షం వారూ జాగరూకతతో గ్రహించాలి, ఆచరణలో చూపాలి.

పావనమైన ఈ భరతభూమికే కాదు యావత్ప్రపంచానికీ ఈ 'గీతా'చార్యుని బోధన అవసరమై ఉన్నది. ఆశావహులై దేవునికి దండములు పెట్టుట వలననూ, స్వార్ధ చింతనతో యజ్ఞయాగములు చేయుట వలననూ ఫలితం ఉండదు, పరమార్ధ చింతనా, పరచింతనా లేనివానికి దైవానుగ్రహం కలుగదు.



అందరూ మంచిగా, అందరి మంచినీ కోరేవారిగా మారాలని ఆ భగవంతుణ్ణే ప్రార్థిద్దాం. **సర్వేజనా స్సుఖినోభవన్తు**

బుధజన విధేయుడు

***గోటేటి శ్రీరామారావు***


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

అధర్మాచరణం అరికట్టాలి

# ధర్మసూక్ష్మాలు

**(అధర్మపరుల ఆహారం భుజించిన వారు కూడా ధర్మాధర్మములు మరిచిపోతున్నారన్నదే ఈ వ్యాసాంతర్గత సత్యం)**

**– కె. మల్లికార్జున,** బళ్లారి

మానవుడి గమ్యం మోక్షం, మోక్ష మార్గాల్లో ముఖ్యమైనది ధర్మం. ధర్మ, అర్ధ, కామ, మోక్షాలు అనే నాలుగు పురుషార్థాల్లో ధర్మమే మొదటిది. అధర్మమార్గంలో ధన సంపాదన గావించి మిగతా పురుషార్థాలు పొందకూడదు. కాబట్టి ధర్మాన్ని పురుషార్థాల్లో మొదట చేర్చారు. అధర్మార్జన అనర్థదాయకం. అలాంటి అధర్మం పునాదిలేని గోడలా కూలిపోతుంది" అర్థసిద్ధి కంటే ధర్మసిద్ధి మహత్తరమైనది. దానివల్ల సకల నిధులు చేకూరుతాయి. శాశ్వత కీర్తి లభిస్తుంది. సద్గతి కలుగుతుంది" అని భారతంలోని శాంతిపర్వం ప్రభోదిస్తుంది.

ఏది ధర్మం, ఏది కాదో తెలుసుకోవడం కష్టసాధ్యం. ధర్మరహస్యం సూక్ష్మమైనది. మహాత్ములు ధర్మశాస్త్రాల్లోని విషయాలకు ఉదాహరణలుగా పురాణ ఇతిహాసాలందు పేర్కొన్నారు. బయటకు సబబుగా కనిపించే విషయం ఆలోచిస్తే అధర్మం అని తేలవచ్చు. అధర్మంగా భావించే విషయం ధర్మబద్ధం కావచ్చు. ప్రజల్లో పాపపుణ్య విచక్షణ ముఖ్యం. తుదకు ధర్మమే జయిస్తుందనే విశ్వాసం సడలకూడదు.

కురుక్షేత్ర యుద్ధం ముగిసింది. "భీష్మాచార్యులు నుంచి ధర్మం తెలుసుకోండి" అని శ్రీకృష్ణపరమాత్ముడు ధర్మరాజాదులకు సలహా ఇచ్చాడు. ధర్మరాజు, తమ్ముళ్లతో, ద్రౌపదితో కలిసి అంపశయ్యపై ఉన్న పితామహుని వద్దకు వెళ్లాడు. అప్పుడు భీష్ముని స్థితిని చూశారు. చావు కోసం ఎదురుచూస్తున్నాడు. ఉత్తరాయణం దాకా ప్రాణాలు నిలుపుకోవాలి.

ధర్మరాజు వినయ విధేయతలతో ప్రార్థించగా భీష్ముడు ధర్మబోధ ప్రారంభించాడు. ఆ మహాత్ముడి పలుకుల్ని అందరూ శ్రద్ధగా భక్తితో ఆలకిస్తున్నారు. ద్రౌపది మాత్రం నవ్వింది.

"ఏం తల్లీ! ఎందుకు నవ్వుతున్నావు?" అని ఆశ్చర్యంతో ప్రశ్నించాడు భీష్ముడు తదుపరి ధర్మబోధ ప్రారంభించాడు. ఆ మహాత్ముడి పలుకుల్ని అందరూ శ్రద్ధగా భక్తితో ఆలకిస్తున్నారు. ద్రౌపది మాత్రం నవ్వింది.

"ఏం తల్లీ! ఎందుకు నవ్వుతున్నావు?" అని ఆశ్చర్యంతో ప్రశ్నించాడు భీష్ముడు.

"ఏదో నవ్వు వచ్చి నవ్వాననీ మధ్యలో నవ్వినందుకు మన్నించమని" ద్రౌపది ప్రార్థించింది. భీష్ముడికి తెలుసు ద్రౌపది అనవసరంగా నవ్వదని.

"అమ్మా! నువ్వు సుగుణశీలివి. అనవసరంగా పెద్దల వద్ద నవ్వవు. మహా పతివ్రతవైన నీవు నవ్వావంటే అందులో ఏదో గూడార్థం దోషం ఉండే ఉంటుంది. దాచక ఉన్న విషయం నిర్భయంగా చెప్పు?" అని అడిగాడు భీష్ముడు.

ద్రౌపది వినయంగా చేతులు జోడించి నమస్కరించింది:

"మహాత్మా! నన్ను మన్నించండి. మీ ఆజ్ఞను కాదనలేక నా మనసులోని మాట చెబుతున్నాను. ధర్మ సూక్ష్మాలను మీరు ఎంతో బాగా ఇక్కడ వివరించి చెబుతున్నారు. అవన్నీ మాకు శిరోధార్యం. కానీ... అని ఆపేసింది.

ద్రౌపదీ! ఆగిపోయావేం? సంశయించక, నీ మనసులోని మాటను చెప్పమ్మా! అని భీష్మాచార్యుడు అడిగాడు,

'మహాత్మా! ఆనాడు నిండు సభలో దుశ్శాసనుడు నన్ను వివస్త్రను గావించడానికి ప్రయత్నించినప్పుడు, ఈ ధర్మసూక్ష్మాలు ఏమయ్యాయి? ధర్మసూత్రాలన్నీ తమరు ఆతరువాతే గ్రహించారా? ఆ విషయం గుర్తుకు వచ్చి ఏడవలేక నవ్వుతున్నాను ఇలా అన్నందుకు క్షమించండి" అని ద్రౌపది అన్నది.

భీష్ముడు కాసేపు మౌనం వహించి, బిగ్గరగా నిట్టూర్చాడు. "ద్రౌపదీ! ఇన్నాళ్లూ నా మనసులో ముల్లులా ఉన్న సంగతే నువ్వు ప్రస్తావించావు. దాన్ని వెలికితీసి నా మనోబాధను ఉపశమింపజేసుకుంటాను. ఆనాటి నా ప్రవర్తనకు ఒక కారణం ఉంది. నా మౌనం ధర్మ సమ్మతమే! దుర్యోధనుడు దుర్మార్గుడు. అతడి కూడు



తినడం వల్ల నా మనసు మలినమైంది. ఎవరి పోషణలో ఉన్నామో వారికి వ్యతిరిక్తంగా ప్రవర్తించరాదు. అందువల్ల చేతగాని వాడిలా మౌనం వహించాను. ఇప్పుడు అర్జునుడి శరసంధానంతో నా మలినమైన ఆ రక్తం అంతా వెలుపలికి పోయింది. అధర్మపూరితమైన అన్నంతో వచ్చిన ఆనాటి రక్తం నేడు నాలో లేదు. కాబట్టే ధర్మోపన్యాసాన్ని ధైర్యంగా చేయగలుగుతున్నాను" అని భీష్ముడు ధర్మసూక్ష్మాలను వివరించాడు. ద్రౌపది ధర్మసందేహం తొలగిపోయింది.

"అధర్మ ప్రభువుల వద్ద పనిచేసే ఉద్యోగులు కూడా ఆలా పాప పంకితులవుతారు" అని ధర్మజాదులు గ్రహించారు. ఈ కలియుగంలో ధర్మం కన్నా అధర్మానికే ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. ప్రతి ఒకటి సుఖజీవనం కోసం అధర్మమార్గములో చతుః పురుషార్థాలలోని రెండవ మార్గమైన అర్థం కోసం ప్రాకులాడుతున్నారు. ధర్మమార్గంలో నడుచుకొనేవారు ఎల్లప్పుడు శాశ్వత సంతోషాలతో సుఖజీవనం గడుపుతారు. ఇది ఎప్పుడు తెలుసుకొంటాడో ధర్మపరుడౌతాడో మానవుడు. ●

## భక్తి, జ్ఞాన, వైరాగ్యాలతో ఆధ్యాత్మిక జ్ఞానాభివృద్ధినొందిన జనకుడు!

**భక్తితో భగవంతుని తలచుచు**
**నిత్యధర్మములు నిర్వర్తించిన**
**అట్టి జనకునకు రాజయోగమున**
**అందరాని మోక్షంబు అందెనే –**

అన్నారు సత్యసాయిబాబా వారు. జనకుని మించిన రాజర్షి లేడు. రాజ్యపాలనలో అత్యంత ప్రావీణ్యం కలవాడు. అచంచలమైన దైవభక్తి కలవాడు. అంతకు మించి ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగినవాడు.

వ్యాసుని వంటి మహర్షి, అష్టాదశ పురాణకర్త, వేదవిభాజికుడైన మహాపురుషుడు అయ్యుండీ, తన కుమారుడు, మహామేధావి, వైర్యాగ సంపన్నుడైన శుకుణ్ణి, జనకుని వద్దకు పంపి, విజ్ఞాన, వైరాగ్యముల్లోని మెలుపులు తెలుసుకోమని పంపాడు.

అటువంటి రాజర్షి జనకుడు తన గురువైన యాజ్ఞవల్క మహర్షి వద్దకు వెళ్ళి, తన పూర్వజన్మ వృత్తాంతము తెలుపమని అడిగాడు. ఆ అడగడం కూడా ప్రార్థించినట్లు అడగడంతో యాజ్ఞవల్కుడు చెప్పాలని భావించి కూడా, జనకుడు తెలుసుకుని అశాంత మనస్కుడవుతాడేమోనని సంశయించాడు. జనకుడు పట్టు విడువలేదు. యాజ్ఞవల్కునికి చెప్పడం తప్పనిసరయింది.

"జనకా! నీవింతగా అడిగావని చెబుతున్నాను విను, "ఈ జన్మలో ఏ స్త్రీయైతే నీకు ధర్మపత్నిగా ఉన్నదో, ఆ స్త్రీయే నీకు పూర్వజన్మలో జన్మనిచ్చిన తల్లి. ఆమె పేగు పంచుకుని పుట్టావు అన్నారు ఋషి. జనకుడు విస్మయుడయ్యాడు. మరింత వైరాగ్యస్థితి పొందాడు. వైరాగ్యమే మోక్షమార్గమనుకున్నాడు. చివరకు బ్రహ్మజ్ఞానియై మోక్ష సామ్రాజ్యాన్ని అధిష్టించాడు. కాలచక్రం, ఋతు చక్రములు సంసారబంధమనే చక్రబంధంలో బంధిస్తాయ్. సత్యమెరిగిన వాడికి సర్వమూ పరమార్థమే అని అనుకున్నాడు.

# శంకరం లోకశంకరమ్! శుభంకరమ్!

# శ్రీ శృంగేరీ జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థస్వామి పాద పద్మములకు నమో నమః

## 52 సంవత్సరాలనంతరం చెన్న పట్టణంలో చాతుర్మాస దీక్ష చేస్తున్న శ్రీ శృంగేరీ పీఠ జగద్గురువులు, పరమపూజ్యులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారు!




అభిషేకం చేస్తున్న శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి

మహాసాగర కెరటాల్లా అనునిత్యమూ త్రిసంధ్యల్లో క్రమం తప్పకుండా తిరుణాల్లా చెన్నై ఆస్తిక జనులందరూ వారిని దర్శించుకుంటున్నారు. శంకర భగవత్పాదుల పాదుకలకు పూజలు చేస్తున్నారు, భిక్షావందనం సలుపుతున్నారు. వారి అనుగ్రహ భాషణలు వింటున్నారు. శ్రీ చరణుల భాషిత భూషణ భాష్యంలో చెప్పాలని భావించినప్పుడు :

**ప్రత్యహం ప్రత్యంవేక్షేత నరశ్చలిత మాత్మనః**
**కిన్నుమే పశుభిస్తుల్యం కింత సత్పురు షైరివ!**

– అంటే మనిషి తాను పశువుగా బ్రతుకుతున్నాడా? సత్పురుషునిగా బ్రతుకుతున్నాడాయని ప్రతీ దినమూ పరిశీలన చేసుకొనాలి! సత్పురుషుని వలె బ్రతుకుటకు ప్రయత్నము చేయాలి. ధృఢ మనస్సుతో నిశ్చయం చేసుకుని, అట్లుత్తమంగా బ్రతుకుటకు సర్వదా కృషి చేస్తుండాలి.



అభినవ విద్యారణ్యులు
శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి

అందుకే శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారు అనుగ్రహ భాషణంలో – మనిషి మహాజలధిలోని చిన్న చిల్లున్న పడవలో ప్రయాణం చేస్తున్నాడు. ఆ చిల్లు ద్వారా పడవకు నీరు చేరి పడవ మునగక మునుపే ఆ మనుజుడు తీరం చేరాలి' అన్నారు.

అందెంతో అంతరార్థం ఉన్నది. మోక్షసాధనకు మూలమైన ధర్మాచరణను చివరి శ్వాసతో ముడివేయకుడు, పడవలో నీరు చేరి మునగనీయకండి–అంటూ ఎంతో అంతర్ధర్మాన్ని చెప్పారు. గీతాచార్యుడు గీతలో కూడా

**యస్మాన్నోద్విజతే లోకోన్నోద్విజతే చయః**
**హర్షామర్షభయోద్వేగైః । ముక్తోయస్స భమే ప్రియః**

– లోకమున ఎవరికినీ ఉద్వేగము (బాధ) కలిగించనివాడూ, ఎవరి వలనా తాను క్షోభపడనివాడూ (దీనినే 'అహింస' అని అనవచ్చును) ఆనందం, అసూయ, భయము, ఉద్వేగాది వికారములు లేనివాడు నాకత్యంత ప్రీతికరమైనవాడు, అతడే నా భక్తుడు అన్నాడాయన 'భగవద్గీత' పన్నెండవ అధ్యాయంలో.

ఆది శంకర భగవత్పాదులు స్థాపించిన చతుర్నామ్నాయ శంకర పీఠాల్లో శృంగేరియే తొలి పీఠం. ఆయన స్వయంగా శృంగేరీలో శారదాదేవి ప్రతిష్ట చేసారు. ప్రత్యక్ష శిష్యవరేణ్యుడైన సురేశ్వరాచార్యులవారిని తొలి పీఠాధిపతిగా చేసారు. అయితే ఈ పీఠం అభివృద్ధి విద్యారణ్య స్వాములవారి కాలంలో బాగా అభివృద్ధి చెందడమేగాకుండా, హంపీ, విజయనగరం వంటి ఓ శ్రేష్ఠమైన తెలుగు ప్రభువుల రాజ్యస్థాపనం జరిగింది. సత్యపాలన, ధర్మోద్ధరణ, సాహిత్యం, కళలు, శిల్పకళా చాతుర్యం, మూడు పూవులూ, ఆరు కాయలుగా విలసిల్లింది. హరిహర రాయలు, బుక్కరాయలు తొలి పాలకులు ఐశ్వర్య సంపన్నులు కావడానికి, రాజ్యంలోని ప్రజలు సుఖసంపదైశ్వర్యాలతో తులతూగడానికి విద్యారణ్యులే ప్రధాన కారకులు. ఆయన శృంగేరికి అనుబంధంగా అనేక ఉప పీఠాలను స్థాపించి, వేద శాస్త్రోపనిషత్తులను పౌరుల్లోకి తీసుకుని వెళ్ళడానికి పండిత సదస్సులను జరిపి, వారిని ప్రోత్సహిస్తూ, సనాతన ధర్మానికి పెద్ద పీట వేసారు. వారినే అభినవ శంకర భగవత్పాదులని కూడా అంటారు. ఆయన వివిధ భాషా వేదశాస్త్ర ప్రవీణులైన తెలుగువారు కావడం, వారివెనుక, ఇప్పటి శృంగేరి పీఠాధీశులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వరకూ గల 36గురు పీఠాచార్యులలో తెలుగువారే అధికంగారావడం తెలుగువారు చేసుకున్న పరమోత్కృష్ట పుణ్యమని చెప్పుకోవాలి. వీరు ఆసేతు హిమాచల పర్యంతమూ పర్యటిస్తూ, ధర్మబోధనం చేస్తూ భక్తులను పునీతుల్ని చేయడమే గాకుండా, సాగర సరిహద్దులు దాటి విదేశ పర్యటనం చేయకపోయినప్పటికినీ, అన్యదేశాల్లో, అనన్యంగా పీఠ అనుబంధిత శారదా ఆలయాలను నిర్మించడం, శృంగేరీలో వలె అక్కడ కూడా త్రికాల పూజలూ, వాహన ఊరేగింపులూ, వేద సంస్కృత పాఠశాలలూ పెద్ద యెత్తున నిర్మించడం జరుగుతూన్నది. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలో నిర్మించిన శారదాలయ, కుంభాభిషేక వైభవాన్ని, 250 మందికి పైగా ఋత్విక్కులుతో జరపడం నేను స్వయంగా చూచి ఆనందించిన సాక్షిని. శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వాముల వారు పీఠానికి రాగానే ఎన్నెన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసారో, ప్రత్యక్ష పరోక్షాలుగా నాకు తెలుసు.

## చెన్నయ్‌లో తెలుగు ఆస్తిక సంఘం వారు శృంగేరీ జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ భారతీతీర్థస్వాముల వారికి గురుపూజ ఘనంగా చేసారు!


### - కడలి కెరటాల్లా తెలుగు భక్తులు తరలి వచ్చారు!! -

ఎప్పుడూ, ఎక్కడా, చెన్నయ్‌లోని తెలుగు ఆస్తిక జనం సకుటుంబ పరివారంగా తరలివచ్చిన సభ నేను చూడలేదు. అడుగు వేయలేని కురువృద్ధులు, అడుగులు వేయడం రాని పిల్లలూ కూడి, ఉదయం 9 గం॥ల నుంచీ రాత్రి 10.30 గం॥ల వరకూ ఉండి, అత్యంత భక్తిపూర్వకంగా జరిగిన తెలుగు భక్తుల సభ ఇదొక్కటే అనుకోవడంలో ఆవగింజయినా ఆశ్చర్యం లేదు.

'ప్రముఖాంధ్ర'నూ, సంపాదకుడు గోటేటి శ్రీరామారావును, సాయంత్రం జరిగిన అనుగ్రహభాషణం అనన్తరం జగద్గురువ శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి ఘనమైన ఆశీస్సులను అందచేస్తూ ఆశీర్వదించడం ఓ గొప్ప అదృష్టం!

గోటేటి శ్రీరామారావు స్వామివారి ఆశీస్సులకు పులకరిస్తూ – జగద్గురోత్తమా! మీరు నాకు ఇక్కడ మరో దర్శన ఆశీస్సులందచేయాలి అని అభ్యర్థించగా భారతీ తీర్ధ మహాస్వామి 'తథాస్తు పూర్ణారోగ్య సిద్దిరస్థు' అని రెండు చేతులతోనూ ఆశీర్వదించారు.

ఇది జీవితంలో మరిచిపోలేని మహద్విశేషం. ఇలా ఈ సంవత్సరంలోని ఫిబ్రవరిలో తిరుపతిలోని వారి శంకరమఠం నూతన భవనంలో ఆగష్టు 20న చెన్నయ్‌లోనూ జరగడం తన పూర్వజన్మ సుకృతమనీ – ఇవ్విధంగానే 40 సంవత్సరాల క్రితం శృంగేరీలో వారి గురువులు 35వ పీఠాధిపతి జగద్గురు శ్రీమతో అభినహోద్దండ విద్యాతీర్థ మహాస్వాముల ఆశీస్సులు అందుకోవడం జీవితం ధన్యత చెందింది.



భారతీతీర్థ మహాస్వామికి పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న నోరి రామకృష్ణ, రోహిణిశాస్త్రి, గోటేటి వెంకటేశ్వరరావు ప్రభృతులు

# శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి అపర విద్యారణ్యులని ప్రస్తుతి!

నేనెఱింగున్నంతవరకూ శృంగేరీ జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి అపర విద్యారణ్యులని 'సత్యమైన నా అభిప్రాయం. శ్రీశ్రీశ్రీ విద్యారణ్యులు వారు ధర్మోద్ధరణకు, వేదోపనిషత్తుల సారాన్ని ప్రజల మెదళ్ళలోకి చొచ్చుకొనిపోవుటకు ధర్మప్రభువులను ప్రోత్సహించారు, ధర్మమూర్తులను ప్రోత్సహించారు. ఆయన ఆశ్శీఃప్రభావం కారణంగానే హంపీ విజయనగర సామ్రాజ్యం ఏలుబడిలోకి వచ్చి, ఎన్నో దేవాలయాలను, గోపురాలను ధర్మ సంస్థలను నిర్వహింపచేస్తూ, పాలకులు, పాలితులను షోడశ కళలతో పాటు, సాహిత్యాన్ని పోషించారు. ఎందరో శిల్ప, చిత్ర కళాకారులను ప్రోత్సహించారు. విద్యారణ్యుల తపోబలం అమోఘమైనది. చతుర్వేదాలు, ఉపనిషత్తులూ, అష్టాదశ పురాణాల్లో తల పండిన పండితుల్ని పోషిస్తే, విజయనగర ప్రభువులు తాము సహితమూ సాహితీ కళావేత్తలై, వాటిని ప్రజల మధ్యకు తీసుకుని వెళ్ళడం, ఆలయాలకు మణులూ, మాణిక్యాలూ, మాన్యాలూ వ్రాసి యివ్వడము, పౌరు లందు ఆధ్యాత్మిక అభిరుచి, సత్ప్రవర్తన కలిగి ఆలయాలున్న ప్రతీ క్షేత్రానికీ వెళ్ళేవారు. గురుకులాలు స్థాపించి గురువుల సన్నిధికి వెళ్లేవారు. శృతులు, పురాణాలూ, ధర్మాలూ గురుముఖంగా శ్రవణం చేసినప్పుడే జ్ఞానమలవడుతుందని గ్రహించి, ఆచరణలో పెట్టింది విద్యారణ్యులే! కఠోపనిషత్తు యీ నిజాన్ని చెప్పడం వల్లనే **ఆచార్యవాన్ పురుషోవేద** అన్నారు. ఈ కఠోర నియమాన్ని ఆచరణలో పెట్టి సన్యాసం స్వీకరించి వారి గురువులు జగద్గురు (తరువాయి పేజీ)

## తెలుగు ఆస్తిక సంఘ ఆధ్వర్యంలో భారతీ తీర్థ మహాస్వామి వారి తెలుగు అనుగ్రహ భాషణం! కడలి తరంగాల్లా తరలివచ్చిన తెలుగు ప్రజలు!!

ధర్మాన్ని పాటించాలని శృంగేరి శారదా పీఠం 36వ పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి చెన్నై తెలుగు ఆస్తిక సంఘం అధ్వర్యంలో జరిగిన మహా సభలో తెలుగులో అనుగ్రహభాషణం చేసారు. టీ.ఎస్.రోహిణి శాస్త్రి, నోరి రామకృష్ణ, గోటేటి వెంకటేశ్వరరావు ప్రభృతులు గురుపాద పూజ, భిక్షావందనం కార్యక్రమాలను మైలాపూర్‌లోని సుధర్మ భవన్‌లో భారీ సభా ఏర్పాటుచేశారు. భారతీ తీర్థ మహాస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఉదయం పది నుంచి 12 గంటల వరకు వేదపఠనం, బిరుదావళి పూర్వక అభినందన పత్ర సమర్పణ, భిక్షా వందనం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంకాలం రోహిణిశాస్త్రి తమ శిష్య బృందంతో వేద ఘోషను విన్పించారు. మాంబళానికి చెందిన శ్రీనివాసులు జయజయహే భగవతీ అనే ప్రార్థనా గీతాన్ని ఆలపించగా, చెన్నై ఆస్తిక తెలుగు సంఘం సభ్యులను, తెలుగు వారినుద్దేశిస్తూ మహాస్వామి ప్రత్యేకంగా తెలుగులో అనుగ్రహ భాషణాన్ని చేసారు. కలియుగంలో ధర్మాన్ని రక్షించేందుకు భగవంతుడు శంకర భగవత్పాదులగా అవతరించారన్నారు. ఆయన అహింస ద్వారా ధర్మ ప్రబోధం చేశారు. మనుషుల్లో పేరుకుపోయిన అపార్థాలను దూరం చేశారు. శంకర భగవత్పాదుల నిరవద అనుగ్రహానికి పాత్రులు కావాలనే సంకల్పంతో తెలుగువారు ఏర్పాటుచేసిన కార్యక్రమం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు. ధర్మం ఉత్కృష్టమైనదని, జగత్తు ధర్మంపైనే ఆధారపడి నడుస్తోందని వివరించారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని ఆచరించి శ్రేయస్సును పొందాలి. మనిషి జన్మ పడవ లాంటిది, పడవకు ఎప్పుడు చిల్లి పడి మునుగుతుందో అప్పుడు మనిషి మరణిస్తాడు. పడవ మునగకుండా తీరాన్ని చేర ప్రయత్నించాలి. మృత్యువు ఎప్పుడూ వెన్నంటే



జగద్గురువులు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థస్వామి ముంగిట నిలుచుని ఆశీస్సులందకుంటున్న గోటేటి వెంకటేశ్వరరావు, రోహిణి శాస్త్రి ప్రభృతులు

ఉంటుంది. ధర్మాచరణ విషయంలో పొడిగింపు పనికిరాదు మనిషితో పాటు వచ్చేది ధర్మమే! ఇందుకు ఉదాహరణంగా ధర్మరాజును తీసుకోవచ్చు.

భగవంతుడు ధార్మికులను రక్షిస్తాడు. ధర్మాన్ని సామాన్య విశేషధర్మములుగా చెప్పవచ్చు. ప్రతి మనిషి సామాన్య ధర్మాన్ని ఆచరించిన అనంతరం విశేష ధర్మాన్ని అనుసరించాలి. శుద్ధిని బాహ్య శుద్ధి, అంతర్గత శుద్ధిగా చెప్పవచ్చును. కామ, క్రోధ, లోభాలు, నరక ద్వారాలని తెలుసుకోవాలి. ఇంద్రియ నిగ్రహం కూడా ధర్మమే. ధర్మాన్ని ఆచరించిన వాడే లోక క్షేమానికి కారకుడవుతాడు. సంతానం సన్మార్గంలో నడవాలంటే తల్లిదండ్రులు సన్మార్గాన్ని అనుసరించాలి అన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో రోహిణిశాస్త్రి, గోటేటి వెంకటేశ్వరావు, నోరి రామకృష్ణ, సీజీకే సోమయాజులు, ప్రభాకరరావు, రఘుకుమార్, జయరామన్, ఆత్మారామన్ ప్రభృత తెలుగు పెద్దలు పాలుపంచుకున్నారు. తెలుగు భక్తులు ఇంతటి బృహత్సమావేశం జరుపడం ఇదే ప్రథమం, అపూర్వం. ●

(ఆరవ పేజీ తరువాయి) శ్రీమదభినవ విద్యాతీర్థ మహాస్వామి వారి సమక్షంలో, శిక్షణలో, పర్యవేక్షణలో శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి వారు వేద వేదాంగాల నన్నిటినీ, అధ్యయనం చేయడమే కాదు, అగస్త్యుల వారిలా ఔపోసనపట్టినట్టు శిక్షణ పొందడం నేను చూసాను. శృంగేరీ పీఠాధికారం అంత సులభంగా లభించేది కాదు. శ్రీ శారదామ తల్లి ఆశీస్సులతో, సర్వసమగ్ర వేదాంతి వేదవ్యాసునిగా విజ్ఞాన శిరోభూషణుడు కావాలి. అంత కఠోర పరిశ్రమ చేసిన గురువరేణ్యులు తపసంపన్నులు జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థస్వామి.

విద్యారణ్యులతో ఎలా పోల్చగలిగారనే ప్రశ్న ఉదయించినపుడు - శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి సాగరములు దాటకుండానే విశ్వంలోని పలు దేశాల్లో శారదా ఆలయాలు నిర్మాణం, వేదోద్ధరణకు వేదపాఠశాలలు నెలకొని నిర్వహింపబడేట్టు చూస్తున్నారు. ఇది సామాన్యమైన కార్యం కాదు. ఆయన ఎవర్నీ ఏంవీ అడగరు. కానీ, కావాలనుకున్న పనులన్నీ ద్రవ్యలోటు లేకుండా జరిగిపోతాయ్. ఇది అమరశిల్పి జక్కన్న శృంగేరిలో శిల్పకళలుట్టిపడే ఆలయం నిర్మించినప్పుడు జరిగినట్టే జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి కాలంలో జరుగుతున్నాయ్. వారి ముఖబింబంలోని తేజస్సు, వారి తపఃసంపద, నిష్కామ దృష్టి, నిరాడంబరత, భక్తజనులపై వారికున్న అపారమైన కరుణా ఆప్యాయతా వీటన్నిటినీ జరిపిస్తున్నాయనీ, వీటి వెనుక శారదాంబ ఆశీస్సు, వారి గురువుల



స్వామివారికి సత్కారము, సన్మానపత్రం సమర్పిస్తున్న తెలుగు ఆస్తిక సభ్యులు

కరుణ, వారి తపస్సు దివ్యశక్తులని విశ్వసిస్తున్నా! ముకుళిత హస్తాలతో విధేయత తెలుపుతున్నా!

**ఇతిఃశుభమ్.**

**మలేషియా లేఖ**

## ఎనిమిది పదుల వయసులోనూ తల్లి భాషా సేవ చేస్తున్న మిమ్ము అన్నయ్యా అనాలని ఉంది!

**ప్రముఖాంధ్ర, సంపాదకులు శ్రీ గోటేటి శ్రీరామారావు గారికి**
**తొలిగా తెలుగు మ్రొక్కులు**

ఎందరో పెద్దలు మన తెలుగు తల్లిని (మాటని) ఉద్ధరించుటకు ఎనలేని సేవ జేసారు. అటువంటి శ్రేణిలో తెలుగు మాట తేజరిల్ల, సల్పుతున్న మీ సేవ పొగడనలవికానిది. కాలానికి తగ్గట్టు ఓ మెట్టు పైకెక్కి తెలుగమ్మకు తామందించే సేవ చాల గొప్పది. పొగడుటకు సరైన మాటలు ఉల్లంబున తోచకున్నవి. సరియైన తెలుగు తెలియకున్నందుకు బాధగాయుంది. ఓ తెలుగన్నయ్యా! నాకు 70 ఏళ్ళ వయస్సు. అందుచే తమను తెలుగన్నయ్యా అనుటలో అంతులేని ముదమొందుచున్నాను. అట్లనడం తప్పైతే, తమకు ఇబ్బందిగా యుంటే మానేస్తాను. తమ మన్నింపుతో దయచేసి మన్నించెదరుగాక.

ఓ తెలుగన్నయ్యా! తెలుగుతల్లి వెలగాలంటే, తెలుగువారందఱు తప్పనిసరి తెలుగులోనే మాట్లాడాలి, వ్రాయాలి, చదవాలి. అందుకై ఓ చిన్న మార్పుగా రావాలి. ఆ మార్పును విప్లవం అనియు అనవచ్చు. ఆ విప్లవాన్ని తామే మొదలెడితే చాలా చక్కగా వుండును. ఆ విప్లవాన్ని చేయగల స్తోమత తమకుంది. అందుకే తమను వేడుకుంటున్నాను. ఆ విప్లవం "అచ్చ తెలుగు మాటలు చదివిన, ఆలకించిన వార్కి త్వరలో అర్థమయ్యేదిగా యుంటే త్వరగా తెలుగు పెంపొందుటకు అవకాశాలెక్కువున్నాయి.


ఎందుకు "అచ్చ తెలుగును" తమను మొదలిడమంటున్నానంటే - మీరు వ్రాయుచున్న వ్యాసాలు, అంశాలు, సూటిగాను, మాటలు అరటి పండులో సూది గ్రుచ్చినట్లు, చదివినవారికి, విన్నవారికి బాధ కలుగకుండా వారి తప్పులను, బాధ్యతలను, అలక్ష్యములను తెలుసుకొనుటకు చెప్పే రీతి అందఱికి రాదు. ఇప్పుడు అటువంటి మాటల్లో చెప్పుటకు తమకు తామే సాటి. అందువలనే, వెంటనే ఆ పనిలో పూనుకొంటారని కోరుకుంటున్నాను. ఇతర మాటలు కలవని, తేటతెల్లని, తేనెకన్న తీపైన అచ్చ తెలుగులో వ్రాయండి. పిన్నలు, పెద్దలు, కొంచెము తెలుగు చదువ వచ్చినవారు త్వరలో అర్థం చేసుకొనే దిన, వార, నెల పత్రికలు, సంచికలు, మాధ్యమాలు లేవు. తెలుగులో అవి వచ్చినప్పుడే తెలుగు వెలుగును, గురజాడ అప్పారావు గారు వాడుక మాటల్లో వ్రాయడం, చదువటం సులభ విధానం ఎన్నడు తెలుగులో వస్తుందో ఆనాడు తెలుగు వెలుగు అన్నాడు. ఆ తెలుగు పెద్ద చెప్పిన మాటలను తెలుగును పెడ చెవిన పెట్టారు. ఆ అలక్ష్యం, తెలుగుతల్లికి ఎంత చేటో! చెప్పలేనంత. ఏ తెలుగు బిడ్డైనా తలస్తున్నారా! లేదు గదా! అందుకే ప్రముఖాంధ్ర సంపాదకులైన తమకు వినయముతో విన్నవిస్తున్నాము.

ఇప్పటి యువకులు కన్నతల్లి మాట యొక్క విలువను అవశ్యకతను గురించి తెలుసుకోవాలి. యువతరం ఎదల్లో తెలుగు గోల, తెలుగు తలంపులు నాటాలి. వారి ఎదల్లో తెలుగు చిగురించాలి. మన కన్నతల్లి తెలుగు మాటను మనమే ఆదుకోవాలి. కాపాడాలి అన్న భావన యువతరం గుండెల్లో గ్రుచ్చుకోవాలి. వారి ఎదల్లో వెలిగించాలి. అది తమంట తాము చేయునట్లు చేయాలి. మనమ్మను మనం పెంచుదామన్న అంకిత తలంపు యువతరంకు పుట్టాలి. అటువంటి వ్యాసాలు ప్రముఖాంధ్రలోనే వెలువడుతున్నాయి. అందుచే ఆ పనిని చక్కగా పక్వంగా ఆరముగ్గిన పండైన తాము తేటైన తెలుగు తెలివిగల తమ వంటి తెలుగు పెద్దలవలనే ఇటువంటి విప్లవం జరుగును. తన సమయం, డబ్బు, స్వచ్ఛంద సేవ, ప్రతిఫలం ఆశించని తమవంటి తెలుగు బిడ్డ దొరకునా తెలుగమ్మకు? అందుకే దయచేసి వివరంగా నా మనవిని పరిశీలించి ప్రారంభించండి. అచ్చ తెలుగును" కొండ కొనలందు దాగియున్న అచ్చ తెలుగును బయటికి తెల్పండి. ఇందువలన తెలుగు చదువరుల తలంపు తెలుగుపై వలపునొందే తావుంది. తెలుగును మ్రింగుతున్న ఇతర మాట (భాష)ల్లో సంస్కృతం కంటే ఎక్కువ ఆంగ్లము. ఇప్పుడు హిందీ మొదలెడుతుంది. అది చేసేవారు తెలుగు వారేగా! రోజుకోమాటైనా ఏడాదికెన్ని పోతున్నాయో లెక్కిస్తున్నారా మీ తెలుగోళ్ళు. కన్న తల్లిని కాపాడుకోలేని తనయులు చంపుతున్న కొడుకులు తెలుగువారన్న బిరుదు తెలుగువారికే సొంతమగునన్న అపకీర్తి తెలుగోడి కొద్దంటే తెలుగోళ్ళు తెలుగును కాపాడే విధానాలు తెలుసుకొని వాటిని పాటించాలి. ఆ విధానాల్లో ఒకటే "అచ్చ తెలుగు" విప్లవం అని నా పుఱ్ఱెలో పుట్టింది వ్రాసాను. తమకు తెల్పాను. ప్రయత్నిస్తారా లేదాన్నది తమ వంతు. తర్వాత, చివరగా మరో కోర్కె! తమ కొడుకు తమ అడుగుజాడల్లో పయనించే పద్ధతి చాలా బాగుంది. తెలుగు తల్లి చేసుకున్న పుణ్యమనే తలంచాలి. ఆయన కలకాలం పదహారు సంపదలతో ఆయురారోగ్యంగా, ఆలుమగలూ, బిడ్డలు బ్రతుక నా ప్రార్థన. ఆయన జీ.వి.రావ్ పేజిను చిన్న మార్పు చేస్తే సరిగ్గా, చక్కగా వుంటుంది. "గోటేటి వెంకటేశ్వరావు పుట/ప్రక్క అని తెలుగులో ముద్రిస్తే చాలా బావుంటుందని నా తలంపు. ముదమొందును మన తెలుగమ్మయని నా యభిప్రాయము. ఇప్పటికి ఇదే నా క్లుప్త కోర్కె! తీర్చగలరా! తెలుగన్నయ్య గారూ!

ఇట్లు
తెలుగు వలపుతో, మ్రొక్కులతో
తెలుగు తమ్ముడు
**(గోపిశెట్టి శ్రీరాములు)**

**మలేషియా రాజు నుంచి బిరుద సత్కారమందిన మలేషియా తెలుగు సంఘాధ్యక్షుడు డా॥ అచ్చయ్యకుమార్‌రావుకు శుభాశీస్సులు.**

**నూట యాభై సంవత్సరాల్లో మలేషియా తెలుగువారిని గుర్తించిన ప్రభుత లేదు. డా॥ అచ్చయ్యకుమార్ రావు అనిరతమైన కృషిని మెచ్చి, గతంలో మలేషియా ప్రధానమంత్రి ఆశీర్వదించి తెలుగుదనం అనే తపాలా బిళ్ళను విడుదల చేయడం, ఇటీవల మలేషియా మహారాజ్ అచ్చయ్యకుమార్‌కు బిరుద ప్రదానంతో సత్కరించడం మహదానందదాయకం.**




# సత్యసాయి మహిమలెన్న తరమా!

**భారతదేశంలో ఎందరో మహాపురుషులు ఉదయించారు. ఆంధ్రదేశంలో భగవాన్ సత్యసాయి అవతరించడం మనమధ్య మసలడం, మనల్ను ప్రేమించడం మన తెలుగువారి అదృష్టం ఆయన మహిమలు అద్భుతాలు.**

**ఒ**కనాడు ఒక పండితుడు అంటే ఘనాపాటికి సత్యసాయి ఇంటర్వ్యూ యిచ్చి "ఏం బంగారం? నీవుఇంత పాండిత్యం పొందావు కదా ఎవరికైననా చెప్పావా అని అడిగారు. లేదు స్వామీ అని అన్నాడాయన. **ఒకవేళ మనకి తెలిసిన ఏ విద్యనైనా ఎవరికీ చెప్పకుండా మనలోనే వుంచుకొని జీవితాన్ని పూర్తి చేసుకునేవాడు మళ్ళీ జన్మలో అడవిలో కాచిన మామిడి చెట్టుగా జన్మిస్తాడని తెలుసుకో అన్నారు. ఒకవేళ విద్యను పంచిపెడితే వాడు పెరట్లో కాచిన మామిడిచెట్టుగా జన్మిస్తాడని చెప్పారు.** అంటే అడవిలో మామిడిచెట్టు కాసిన కాయ ఎవరికీ ఉపయోగపడదని, అలాగే పెరట్లో కాస్తే శుభకార్యాలకు, పూజలకు, పండుగలకు, అన్నిటికీ మామిడి ఆకులు, పండ్లు, కాయలు అన్నీ ఉపయోగపడునట్లు మానవుడు ఉపకార బుద్ధితో అభివృద్ధి చెందాలని, సమాజానికి ఉపయోగపడాలని స్వామి తెలియజేశారు. ఆ పండితునికి ఇంగ్లీషు రాదు. మలయాళం రాదు. తెలుగువాడు కాబట్టి తెలుగువచ్చు. ఢిల్లీలో కొన్ని సంవత్సరాలు ఉండటం చేత హిందీ కూడా కొంచెం మాట్లాడటం వచ్చు అంటూ పండితుడు చెప్పినది అలాగే చెబుతున్నాం. ఆసుపత్రిలో పనిచేసేటప్పుడు రోజు ఉదయం 4 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, ఒక 10 ని॥లు ఆదిశంకరులవారి భజగోవిందం శ్లోకాలలో ఒక శ్లోకం చెబుతూ సత్సంగం జరిగేది. అన్ని రాష్ట్రాల సేవాదళ్ వారు వినేవారు. ఐతే తెలుగు, హిందీ, కొంచెం మద్రాస్ కేరళ రాష్ట్రాలవారు వచ్చినప్పుడు Yes, No, Alright అలాగా ఇంగ్లీషులో కొన్ని విషయాలు తెలియజేసేవాడిని. యిలా 16 సంవత్సరాలు జరిగాయి. ఒకసారి కేరళ రాష్ట్రం అలపి వాళ్ళు నన్ను ఆహ్వానించారు. వెళ్లాను. పెద్ద సభ ఏర్పాటు చేసారు. నేను ఏ భాషలో మాట్లాడాలి అనుకున్నా, పుట్టపర్తి స్వామీ! కాలేజ్ స్టూడెంట్సు సమక్షంలో ఉపన్యాసం చెప్పేటప్పుడు ముందుగా ఒక వాక్యం అందరూ అంటూ వుంటారు. "Pranams the lotus feet of Bhagawan Sri Satya Sai Baba" అని చెప్పడం నేను ఎందుకైనా మంచిదని కంఠస్థం చేసాను. ఆ వాక్యమే కేరళలో బాబా ఫోటో ముందు నమస్కరించి స్టేజీపై మైక్‌లో గట్టిగా "Pranams at the Lotus feet of Bhagawan Sri Satya Sai Baba" అని చెప్పాను. అందరూ ఇంగ్లీషు చాలా చక్కగా మాట్లాడుతున్నానని అనుకున్నారు. కాని నాకు అసలు తరువాత వాక్యం ఏమి మాట్లాడాలో తెలియలేదు. సడన్‌గా నా వాక్కులో స్వామి ప్రవేశించి నాచేత గంటసేపు ఇంగ్లీషులో ఉపన్యాసం ఇప్పించారు. ఆ వూరి సభ్యుడు మలయాళంలో ట్రాన్స్‌లేట్ చేసారు. ఆశ్చర్యం ఏమంటే ఉపన్యాసం అయిన వెంటనే ఒక ముసలాయన నా దగ్గరకు వచ్చి "నేను తిరుపతి నుండి యీ ఊరికి పనిమీద వచ్చాను. ఈ ప్రక్కనే ఉన్న లాడ్జ్‌లో వున్నాను. ఈ కేరళలో ఎవరైనా మలయాళం లేదా ఇంగ్లీషులో ఉపన్యాసం చెప్తారు. కాని నాకు నీవు తెలుగులో ఇంత చక్కగా మాట్లాడావని ఆలింగనం చేసుకొని ఆనందపరవశుడై నన్ను దీవించారు. బహుశా నేను అనుకొన్నాను. భగవంతుడు ఒకనికి "మూకు కరోతివాలూలం ఫంగూలంఘయ తేగిరం" అన్నట్లు ఈ భాష రానివాడిని కాపాడి వాడిచేత పలికించిన సత్యసాయీశ్వరుని మహిమ నేను ఎప్పుడూ మరువలేనని చెప్పుచున్నాను. ఇది 1998 సంవత్సరములో జరిగింది.

ఒకసారి బాబావారు దర్శనానికి వచ్చేముందుగా వారు నడచివచ్చి దర్శనం ఇచ్చే రోజులలో ఒక పెద్ద పట్టాను సేవాదళ్ వారు పరిచేవారు. వారు దానిపై మెల్లమెల్లగా నడచి వచ్చి అందరి దగ్గఱకి వచ్చి లెటర్స్ తీసుకొని, కొంతమందిని దీవించి, కొంతమందికి ఇంటర్వ్యూలు ఇచ్చేరోజులవి. స్టూడెంట్స్ బాబాపై అపరిమితమైన ప్రేమతో వుంటారు. ఆ కార్పెట్‌పై చిన్న పుల్ల ఎక్కడి నుండో వచ్చి పడింది. అది బాబావారి పాదాలకు గుచ్చుకుంటుందని ఈ స్టూడెంట్స్ అందరూ గుసగుసలాడుకొంటూ బాబా వారు వచ్చే ముందు అనుకొంటున్నారు. కాని ఎవరూ తీయలేదు. ఇంతలో ఒక పావురం ఎగిరివచ్చి ఆ పుల్ల తీసుకొని వెళ్ళిపోయింది. బాబా వచ్చేసారు. స్టూడెంట్స్‌ని అడిగారు. ఏం జరిగింది అని. స్టూడెంట్స్ "స్వామీ! ఆ పుల్లని తీసేద్దామనుకున్నాం, తీయలేకపోయాం అని చెప్పారు. తరువాత ఏం జరిగింది అని బాబా ప్రశ్నించారు. ఒక పావురం వచ్చి తీసుకొని పోయిందని చెప్పారు. దానికి బాబావారు 'చూసారా! చేద్దాం చేద్దాం అనేలోపుగా ఆ సేవ ఏదో రూపంలో, ఎవరో ఒకరు చేసుకొని పోతారు. మీరు సేవ కోసం వెతుక్కొని సేవ చేయాలి' అని బాబా చెప్పడం. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టినట్లుగా, దైవం ఉన్నప్పుడే వారి విషయాలు స్మరణ చేసుకొని, మననం చేసుకొని ఆచరించాలని తెలియజేయటం ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

ఏ యుగంలోనూ దేవుడు శాశ్వతంగా, భౌతికంగా లేరని మనకి తెలుసు. అల్లా, జీసెస్, బుద్ధ, రామ, క్రిష్ణ అవతారాలలో ఏ ఒక్కరూ సూక్ష్మరూపంలో అందరియందు ఉన్నారనే సత్యాన్ని గుర్తించాలి. అవతారాల్లో భక్తులను అలరించి వస్తానని సత్యసాయి మాట యిచ్చిన ప్రకారం అవతరించనున్నాననే మాట యదార్థం. ●

# సంగీత సాహిత్య ఆధ్యాత్మిక కళాసేవాంకితులు శ్రీ టి.యస్. రామచంద్రరావు


ఆధ్యాత్మిక కళాసేవాంకితులౌతూ అనర్గళంగా తన ప్రసంగాల ద్వారా వివిధ సంగీత వాగ్గేయకారుల రచనలను గానం చేస్తూ వేలాది మంది అభిమానానికి పాత్రులౌతున్న విద్వాన్ టి.యస్.రామచంద్రరావు విజయవాడ నగరంలో కళాపోషకులుగా, ఆధ్యాత్మిక సంస్థల ప్రచారకులుగా సేవ చేసి ధన్యతనొందుతున్న మహానుభావులు, ఎప్పుడూ చిరునవ్వుతో ఆప్యాయంగా పలుకరించే సహృదయులు, స్నేహశీలి, పెద్దమనిషి, దైవభక్తి పరాయణులు, సద్గురు త్యాగరాజస్వామి కీర్తనలపై ఎనలేని భక్తి ప్రపత్తులు కలిగినవారు. 'రామభక్తి సామ్రాజ్యం ఏ మానవుల కబ్బెనో' అని త్యాగరాజస్వామి అన్నట్లుగా ఆ సామ్రాజ్యంలో కొంతచోటు సంపాదించుకొని, జీవితం ధన్యం చేసుకోవాలని ఆ శ్రీరామచంద్రుణ్ణి నిత్య మననం చేసుకుంటూ, 'శ్రీరామపాదమా నీ కృప చాలునే', 'మోక్షము కలదా భువిలో జీవన్ముక్తులుగాదే'యని నిరంతరం త్యాగరాజ కీర్తనలోని భావాలను అనుభవించి తరిస్తూ శేషజీవితాన్ని దైవాంకితంగా కళాసేవలోను, సామాజిక సేవలోను గడుపుతున్న అదృష్టశాలి.

ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ గ్రామంలో ప్రసిద్ధ సంగీత ఆధ్యాత్మిక భక్తులైన కీ.శే. తాడిమేటి విశ్వనాథం, శ్రీమతి శేషమ్మ పుణ్యదంపతులకు 1931వ సం॥లో జన్మించారు. తల్లిదండ్రులు మాతా అరవిందుల భక్తులు. నిత్యం పూజలు, భజనలు వీరింట్లో జరుగుతుండేవి. చిన్నతనంలోనే మాతా అరవిందులను దర్శించుకున్న భాగ్యం పొందిన ధన్యశీలి, సంగీత సాహిత్య లలిత కళలతో పాటు దైవపూజలు, దాన ధర్మాలు, సమాజసేవలన్నీ తల్లిదండ్రుల వారసత్వంగా లభించిన సుగుణాలు. వీరి చిన్నతనంలో ప్రసిద్ధ సంగీత విద్వాంసులు కీ.శే. ఆచార్య డొక్కా శ్రీరామమూర్తి గారు పెనుగొండలో వీరి



ఇంటి భాగంలో ఉండి వీరి సోదరికి సంగీతం నేర్పిస్తూ ఉండగా చూచి, ఆ పాఠాలన్నీ తిరిగి ఆచార్యుల వారికి వినిపించగా, వీరిలో వున్న సంగీతాభినివేశమును మెచ్చుకొని అనేక సంగీత భక్తి భావ, వేదాంత విషయాలు తెలుసుకునే అవకాశం వీరికి లభించింది. చదువు పూర్తిచేసుకొని మద్రాసులో ప్రముఖ కంపెనీలో ఉన్నత ఉద్యోగం చేస్తూ కొన్ని సంవత్సరాలు తమిళ దేశంలో ఉండటం వలన బహుభాషా ప్రావీణ్యము నార్జించారు. సంగీత సభలు, సంగీత విద్వాంసుల పరిచయాలు, సంగీత కచేరీలు వినే అవకాశం, సంగీత వాగ్గేయకారుల రచనలపై పరిశోధన చేసి ప్రసంగించే అవకాశాలు వారికి కలిగాయి. తనవంతు సేవగా అనేక సంస్థలకు విరాళములిచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం, విజయవాడలో ఉంటూ గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారి సంగీత పరిషత్, స్వరఝరి సంగీత సభ, సద్గురు నారాయణతీర్థుల ట్రస్ట్, అరవింద సొసైటీ మొదలైన సంస్థలకు అధ్యక్షులుగా ఉంటూ అపారమైన సేవ చేస్తున్నారు. 'సుఫల' అనే ఒక సంస్థను స్థాపించి కొంతమందికి జీవనోపాధి కల్పించి సేవ చేస్తున్నారు. ఆయన ఎవరికి ఏ సహాయము చేసినా భగవదాంకితంగా భావించి, నిరాడంబరంగా గుప్తదాతగా ఉంటారు. 2007లో ఆయనకు 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంలో అభిమానులు, పలు సంస్థలు వీరిని ఘనంగా సన్మానించాయి. వీరు కూడా అనేకమంది కవులకు, సంగీత విద్వాంసులకు, ఆధ్యాత్మిక గురువులకు, వివిధ కళా నిష్ణాతులకు ఎన్నో సన్మానములు చేస్తున్న మహానుభావులు. విజయవాడ టిక్కిల్ రోడ్డులో ఉన్న వీరి భవనం ఒక ఆధ్మాత్మిక కేంద్రం. సత్సాంగత్యంతో, విద్వాంసులతో, బంధుమిత్ర శ్రేయోభిలాషులతో కళకళలాడుతూంటుంది. వీరి సహధర్మచారిణి వీరి అభిలాషకు పూర్తిగా సహకరిస్తూ ఉండటం చేత ఆరోగ్యకరమైన, ఆనందకరమైన జీవితాన్ని గడుపుతున్నారు. వారింటి ప్రాంగణంలో చల్లని నీడనిచ్చే వివిధ రకాల చెట్లతో పాటు, ఇంటి మిద్దె ఒక పంట భూమి చేసుకొని కూరగాయలు, ఫలపుష్పాల మొక్కలు, చెట్లు వేసి ఉద్యానవనంగా తీర్చిదిద్దుకున్నారు. ప్రతి నిత్యం కొన్ని గంటలపాటు భగవన్నామ స్మరణంలో త్యాగరాజ, నారాయణతీర్థుల తరంగాలు, అరవిందుల భజన కీర్తనలు పాడుకొనడం వీరి దినచర్యలలో ఒక భాగం. నిండు నూరేళ్ళూ వీరి జీవితం ఇలానే కొనసాగాలని కోరుతున్నాం. విజయవాడలో ప్రతి సంవత్సరం జరిగే సంగీత సన్మండలి త్యాగరాజ ఆరాధనోత్సవాలకు ఆర్థిక సహాయము అందిస్తున్నారు. ఇదంతా తొలినేజేసిన పూజాఫలము, పెద్దల ఆశీర్వచనం అంటారాయన. ●

# శివానంద స్వరూపులు, మహోదయులు సద్గురు కందుకూరి శివానందమూర్తి ఆశ్శీఃశతం



ఆ నవ్వుల్లోనే శివానందం

**శ్రీ గోటేటి శ్రీరామారావుగారు ఒక విశిష్టమైన తెలుగు మాసపత్రిక నడుపుతున్నారు. ఆయన ఎటువంటి ఇబ్బందులనీ లక్ష్యపెట్టకుండా ఈ పత్రికను నేటివరకూ 18 సంవత్సరములు జయప్రదంగా నిర్వహించారు. ఆయన అసహాయశూరుడైన సాంస్కృతిక ఉద్యమకారుడు. భారతీయ సంస్కృతికి, దేశానికి, ప్రజల క్షేమాదులకు ఆయన అంతరంగం అంకితమైనది. ఆయన సంపాద కీయాలు చూస్తే విషయం తెలుస్తుంది. అనేక అపురూప విషయాలతో కూడిన ఈ పత్రిక ప్రజల ఆదరాభిమానాలతో చిరకాలం కొనసాగాలని, ఈశ్వరుడు శ్రీరామారావు గారికి ఆరోగ్యము, ఉత్సాహముతో కూడిన ఆయువు ప్రసాదించాలని కోరుతున్నాను.**

ఆనందవనం, భీమిలి — **కందుకూరి శివానందమూర్తి**

*If you want Comfortable Stay-
Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

**6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114**

## 'అ' తెలుగు భాషా తొలి అక్షరమైనట్టు తొలి తెలుగు వాగ్వైభవ వాగ్గేయకారుడు అన్నమయ్య

# జీవిత దార్శనికుడైన తొలి తెలుగు వాగ్వైభవపాద్యుడు!

'అదివో అల్లదివో శ్రీహరివాసము' సంకీర్తన అనగానే అందరికీ అన్నమయ్య ముందుగా గుర్తుకువస్తాడు. కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరుని తన మనస్సులో ప్రతిష్ఠించుకుని భక్తితో పరవశిస్తూ ఆ ఏడుకొండల వానిపై కొన్ని వేల సంకీర్తనలను రచించాడు. సకల శాస్త్రాలను, పురాణాలను, ఇతిహాసాలను అన్నమయ్య ఔపోసన పట్టాడు. వాటిలోని మర్మాలను తన అపురూప గాన మాధుర్యంతో ప్రజలకు అందించాడు. సమాజంలో ఉండే అసమానతలను ఎండ గట్టాడు. జీవిత సత్యాలను సైతం విడిచి పెట్టలేదు. ఆయన సంకీర్తనలను పరిశీలిస్తే, ఆయన ఒక మనోవైజ్ఞానికుడు అని తెలుస్తుంది. అంతేకాదు, భగవంతుణ్ణి తన మనస్సులో నిలుపుకుని తన్మయంతో గానం చేసిన భక్తుడు. తన సంకీర్తనలలో నవరసాలను పొందుపరిచాడు. జీవన సత్యాలను ప్రస్తావించాడు. అన్నమయ్య అంతటి మహానుభావుడిని ఏ యితరులతోనూ పోల్చలేము.

### అచ్చ తెలుగు నుడికారం...

అచ్చ తెలుగు పదాలతో, తెలుగు నుడికారంతో, అలతి అలతి పదాలతో తన సంకీర్తలను అందంగా తీర్చి కూర్చాడు. నాడు వాడుకలో ఉన్న పదాలను ఉపయోగిస్తూనే, ప్రజలను చైతన్యవంతులను చేశాడు. తానెరిగిన సత్యాన్ని, తను నమ్మిన ధర్మాన్ని, ప్రజలకు తెలియజేయాలనే సత్సంకల్పంతో ప్రజలందరూ అర్థం చేసుకుని పాడుకునే విధంగా, వాడుక భాషలో సంకీర్తనల సంకలనం చేసి. తన్మయత్వంతో నర్తించి పాడాడు.

అచ్చ తెలుగుకి కొద్దిపాటి మార్పులు చేసి జానపద బాణీలలో సంకీర్తనలను తయారుచేసి వాటిని పల్లెప్రజలు పాడుకొని ఆనందింపచేసేలా చేసాడు. అందులో పరమార్థం ఉంది, పరమానందం ఉంది. పరమ దార్శికత్వం ఉంది.

'తందనానా అహి', 'సిరుత నవ్వులవాడె సిన్నక్క', 'వేడుకుందామా'... అంటూ జానపదుల వ్యవహార పదాలను, వారివైన భాషలో, బాణీలో రచించాడు అన్నమయ్య. కొలనిగోవరికి గొబ్బిళ్లో అంటూ అన్నమయ వ్రాసిన ఆడపిల్లల గొబ్బిళ్ల పాటలు నేటికీ పల్లెల్లో గొబ్బిళ్లతో సజీవంగా ఉన్నాయి.



ఆనాడే సమసమాజ స్థాపనకు నాంది పలికిన సంఘ సంస్కర్త. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే కీర్తనలో... ఛండాలుడుండే భూమి, బ్రాహ్మణుండుండే భూమి ఒక్కటే. బ్రహ్మమొక్కటే... అంటూ సమసమాజం గురించి ఎలుగెత్తి చాటాడు.

'నానాటి బ్రతుకు నాటకము' సంకీర్తనలో... ఎవరు ఎంత బాగా బ్రతికినా, ఎంత హీనంగా బ్రతికినా ఈ బ్రతుకంతా నాటకమే. చివరకు కైవల్యం చేరడమే అందరికీ కావలసింది.

'చావు, పుట్టుకలు రెండే నిజాలు. నట్టనడిమీ సిరి నాటకము'... అంటూ మూడే మూడు ముక్కల్లో జీవిత సత్యాలను వేదాంత ధోరణిలో బోధించాడు. నరుల జన్మ ఏం జన్మ. అడవిలో మృగం, ఆకాశంలో పక్షులు కూడా స్వేచ్ఛగా ఉన్నాయంటూ కీర్తనలో వాపోయాడు.

'కడుపెంత తాకుడుచు' సంకీర్తనలో... తిండి కోసం మానవుడు పడే యాతనను తనదైన వేదాంత ధోరణిలో పలికించాడు. 'మనుజుడై పుట్టి మనుజుని సేవించి' సంకీర్తనలో... మనిషిని మనిషి సేవించడాన్ని నిరసించాడు.

'ఈ పాదమే కదా ఇల ఎల్ల కొలచినది', 'చెలగి వసుధ కొలచిన ఈ పాదము'... అంటూ భూమిని వర్ణించిన భూగోళ శాస్త్రజ్ఞుడు. 'అదివో అల్లదివో శ్రీహరివాసము' అంటూ ఏడుకొండలను వర్ణించాడు. 'చందమామ రావే, జాబిల్లి రావే' అంటూ చంద్రుడిని, 'ఇన్ని రాశులయునికి' అంటూ రాశులను వర్ణించాడు.

'డోలాయాంచల' గీతంలో దశావతారాల వర్ణన, 'కొండలలో నెలకొన్న కోనేటిరాయడు' అంటూ వేంకటేశ్వరుడిని, 'చిన్ని శిశువు' అంటూ శ్రీకృష్ణుడి లీలావిలాసాలను వర్ణించాడు.

'రామా లాలీ' అంటూ రాముడికి జోల పాడుతూ, ఆ ఊయలను వర్ణించిన వైనం చిత్రంగా ఉంటుంది.

**తొలుత బ్రహ్మాండమ్ము తొట్టె గావించి**
**నాలుగు వేదముల గొలుసులమరించి**

తీరైన ఫణిరాజు పాన్పుగా చేసి... అని వర్ణించడం చూస్తే అన్నమయ్య పాండిత్యం అర్థమవుతుంది. 'క్షీరాబ్ధికన్యకకు' అంటూ అమ్మవారిని స్తుతిస్తూ, ఆ స్తోత్రంలో రకరకాల పూలను వర్ణించాడు. వేంకటేశ్వరుని చేతిని అన్నమయ్య కీర్తించిన విధం చూస్తే, అది కారణజన్ములకు మాత్రమే సాధ్యమవుతుందని పిస్తుంది. దేవతా మూర్తులను తన్మయంతో గానం చేసిన తీరు ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

### పెళ్లి పాటలు

పిడికిట తలంబ్రాల పెళ్లికూతురు...

అంటూ పెళ్లికూతురు సిగ్గును కూడా విడిచిపెట్టలేదు. **ఏమొకో, చిగురుటధరముల...** అని చెప్పడంలో శృంగార రసాన్ని చూపాడు.

**జగడపు చనవుల జాజర...** అంటూ దేవుళ్లకు సైతం వేడుకలు చేసి చూపాడు. కామిగాక మోక్షగామి కాదు అన్న సత్యాన్ని నిరూపించాడు.

తన భావజాలంలో 32 వేల సంకీర్తనలను పలికిన అన్నమయ్య చరితార్థుడు. 500 సంవత్సరాలైనా నేటికీ అవి సజీవంగా నిలచి ఉన్నాయంటే అది అన్నమయ్య పదకవితకు ఉన్న గొప్పతనమే. ఆయన దార్శనికతే అన్నమయ్య గీతాలు తిరుమల తిరుపతి దేవస్థానం వారి కృషితో విశ్వవ్యాప్తినొందుతున్నాయ్. ●

*Compliments from*
**Sri Krishna Bhat**
**When you come to Holy Pilgrimage Centre Tirupati & Tirumala**
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# చెన్నయ్‌లో అందరూ 'మద్రాసు డే' చేస్తున్నారు!
# చెన్నయ్ మహానగరం ఇంతగా ఎదగడానికి ఆర్యవైశ్యులే కారణం!
# ఆర్యవైశ్యుల అభివృద్ధికి 'అమ్మ' వాసవీ కన్యక అనుగ్రహమే కారణం!

## 'మద్రాసు డే' వారు జరిపితే బాగుంటుంది

**- కృతేషు రేణుకాదేవీ - త్రేతాయాం జనకాత్మజా - ద్వాపరే ద్రౌపదీ దేవీ! కలౌ వాసవీ కన్యకా!** అంటూ ఆ తల్లిని స్తుతిద్దాం, స్తోత్రిద్దాం.



ధర్మానికి గ్లాని కలిగినప్పుడు ఆది పరాశక్తి, ఏదో ఒక రూపమున ధరణిని అవతరిస్తూనే ఉండి ధర్మాన్నీ, దాన ధర్మాన్నీ పునరుద్ధరణ చేస్తూనే ఉన్నది.

**ధ్యాయే శ్రీవాసవీదేవీం, బ్రహ్మ విష్ణు శివాత్మికాం పరాశక్తి, జగద్ధా త్రీం! కన్యకా పరమేశ్వరీం!**

బ్రహ్మ విష్ణు శివాత్మికయిన జగత్పరాశక్తి, జగతి నుద్ధరించే ఆ మహాశక్తి కన్యకా పరమేశ్వరి అయి ఆ తల్లి అంశామూర్తిని చెన్నపట్నంలో చెట్టంత స్థాయిలో ప్రాచీన ప్రాచుర్య షాహుకారు పేటలో ఆర్యవైశ్యులందరూ కూటమిగా ఉండే కొత్వాల్ చావడిలో వాసవీ కన్యకా పరమేశ్వరిని వేదోక్తంగా ప్రతిష్ఠించి, బ్రహ్మాండమైన ఆలయాన్ని, గోపురంతో సహా ఆది కాలంలోనే నిర్మించారు. ఆకాశమంత పందిరీ, భూదేవి అంతటి విస్తీర్ణమూ గల, ఆ సువిశాల ఆలయం చుట్టూ, ఆర్యవైశ్యులు యిప్పటికినీ కోట్లకొద్దీ రోజువారీ వ్యాపారం చేస్తున్నారు. వ్యాపార లాభాల్లోని హెచ్చు శాతంతో దానధర్మ సంస్థలను విద్య, విద్యాలయాలను, వసతి గృహాలను, నిత్యాన్న సంతర్పణలను వందల ఏళ్ళ నుంచే చేస్తూన్నారు, చెన్నపట్టణ విస్తరణకు వారి దానధర్మములే 'పురం'ల 'మహా నగరం'గా చెలువొందడానికి ప్రధాన కారకులయ్యారు; అవుతున్నారు. వందల కొద్దీ ఉన్న వైశ్యుల ఛారిటీస్ విద్య, వైద్యం, కళలు, సంస్కృతీ, సంపదలు పెరగడానికి ప్రధాన కారణమైంది.

'మద్రాసు డే' జరపడానికి ఆర్యవైశ్యులే అర్హులు. అభినందనలందుకోవడానికీ లక్షలాది జనుల ఉపాధికీ, ఉన్నతికీ, ఉనికికీ వారే కారకులు.

మద్రాసులో అరబిక్ పద్ధతిని మ్యూజియమ్ థియేటర్ కట్టినవాడు ఆర్యవైశ్య ప్రముఖుడు నంబెరుమాళ్ళు చెట్టి, తొలిగా మద్రాసుకు కారును కొని తెచ్చి 'కారు'లో తిరిగినవాడూ ఆయనే! మద్రాసులో తొలి జాతీయోద్యమకర్తా, సమావేశకర్తా, క్రీసెంట్ ఆదిగాగల పత్రికలను ప్రారంభించినవాడు లక్ష్మీ నరసింహులు చెట్టిగారు ఆర్యవైశ్య ప్రముఖుడు.

కొత్వాల్ మార్కెట్‌కు కొలువైనవాడు తెలుగు ఆర్యవైశ్యుడే. కన్యకాపరమేశ్వరీ ఆలయం నిర్మించినవారూ, ఏకాంబరేశ్వరాలయం, కాళికాంబ ఆలయం, పార్థసారథి ఆలయం, కపాలేశ్వర ఆలయాల అభివృద్ధికి ఆర్యవైశ్యులే కృషి ఎంత గానో ఉన్నది.


రావుబహద్దూర్ కలవల కన్నయ్య చెట్టి వంటి ఆర్యవైశ్యులెందరో, విద్యాభ్యున్నతికీ, సాంస్కృతిక వికాసానికీ, తెలుగు పద్య నాటక పురోభి వృద్ధికీ ఎంతో కృషి చేసారు. అలాటి వంటి వారిలో మనోహరచెట్టి వంటి వారు చిరునామాగా ఉన్నారు.

మద్రాసు పెన్సిల్ ఫ్యాక్టరీ, హో అందు కో, వి. పెరుమాల్ చెట్టి వంటి స్టేషనరీ ముద్రణాలయాలు నడిపిన పెరుమాళ్ చెట్టి కంపెనీ వారు ఆర్య వైశ్యులు. సత్రములు, దానధర్మాల కోసం ఛారిటీస్ ప్రారంభించిన ఆర్యవైశ్యుల సంస్థలు వందలకొలదీ వితరణా పథకంలో నేటికీ సజీవంగా ఉన్నాయ్. **ఇటీవల పబ్బిశెట్టి రాఘవయ్య ఛారిటీస్ శత వర్షోత్సవం జరుపుకున్నది. ఆ టీమ్ లీడర్ వై.హరికృష్ణ. అలాటి ఛారిటీస్‌లో ట్రస్టీలుగా ఉన్న వైశ్యవరే ణ్యులు విడిగా కూడా దానధర్మ కార్యాలు చేస్తూన్నారు.**

ఉమ్మిడి, నాదెళ్ళ, వేమూరి వంశీయులు (క్రొత్తగా ప్రారంభమైన జి.ఆర్.టి.) బంగారు వ్యాపారంలో కొత్త పలుకుబడులకు శ్రీకారం చుట్టారు. దానధర్మ సంస్థలూ, విద్యాలయాలూ నిర్వహిస్తున్నారు.

న్యాయశాఖలో కృషి చేసిన టి.రామ ప్రసాదరావు వంటివారు మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులుగా చరిత్ర సృష్టించారు. రాజకీయంగా వైశ్యులు ఎదిగిన ఘనచరిత్ర మద్రాసుకున్నది. భాషా రాష్ట్ర ఉద్యమంలో ఆంధ్రరాష్ట్రం కావాలని 56 రోజులు నిరాఘాటంగా నిరసన వ్రతం (అన్నపానాదులను త్యజించి) జరిపిన ఆర్యవైశ్య వరేణ్యుడు, త్యాగీ, అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం జరిపినది ఈ మద్రాసుదే కావడం, చెన్నై పట్టణంలోని ఆర్యవైశ్యుల ప్రతిష్ఠా ధర్మకిరీటానికో కలికితురాయి.

ఏ రకంగా చూచినా ఆర్యవైశ్యుల ధర్మచరిత్ర 'మద్రాసు'కు ఆయువు, ఐశ్వర్యం అభివృద్ధి చేకూరుస్తూనే ఉన్నది. అందుకా వాసవీ కన్యకా పరమేశ్వరి పరిపూర్ణ ఆశీస్సులు అందిస్తూంటుంది. మా 'ప్రముఖాంధ్ర' ఉన్నతికి వారే కారకులు. ●

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

ఈనాడు తెలుగు వాకిట త్యాగరాజ కృతులు రతనాల పందిళ్లు వేసి, ముత్యాలముగ్గుళ్ళుపై 'పల్లకీ' ఎక్కి త్యాగరాజ కృతులతో ఊరేగి సంగీతోత్సవాలు జరుపుకుంటున్నాయంటే మొన్నమొన్నటి ఆగస్టు 3న, కర్నూలులో శత సంవత్సరోత్సవ పండుగను చేసుకున్న శ్రీపాద పినాకపాణి గారే కారణం. అష్టదశాబ్దికి పైగా వారు జరిపిన కృషే! అనేకానేక సంగీత విద్మణ్యులు తెలుగువారిలో పెరిగి, కర్ణాటక సంగీతాన్ని ధరణిలో మహావృక్షంగా మర్రి ఊడలుతో ధృఢంగా నిలిపిన కారకుడాయనే!

సత్యం చెప్పుకోవాలంటే తొంభై సంవత్సరాల క్రితం సంగీతం పద్యనాటకాలపై, హరికథా కాలక్షేపముల్లోనూ పచ్చని మరకత వేదికలందు చలువ పందిళ్ళు వేసిన చందంగా, సాంప్రదాయ సంగీతం జనానందకారకమైంది. కాకర్ల త్యాగరాజు సంగీత కృతులు తమిళుల నోట తియ్యని తెలుగు త్యాగరాజ కృతులు సంధింప బడినవే తక్క, తెలుగు విద్వాంసుల వాగ్వాణి ద్వారా విభవ మొందలేదు.

'వందేళ్ళ క్రితం శ్రీకాకుళం జిల్లాలోని ప్రియాగ్రహారంలో, శ్రీపాదవారింట పుట్టి, పినాకపాణి నామధేయుడైన ఆ పసి హృదయాన్ని, ఏ సామవేద సారవాణి ఏ సుముహూర్తాన పల్లవించి, శరముల్లా సంధించి స్వరం సంగమింపబడిందో. త్యాగరాజ రాగ మాధుర్యం అంకురించింది. ఆ కుటుంబీకులే సంగీతాస్వాదకులు కావున ఉగ్గుపాలతో సంగీత స్వరం పినాకపాణి గారి హృదయ కుహరమును తాకింది.

పదకొండేండ్లు వచ్చేసరికి సరిగమపదనిస సంగీత స్వరాలన్నీ ఆయనతో చెలిమి చేయనారంభించాయ్. ప్రక్కనే ఉన్న విశాఖపట్టణంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో వైద్య విద్యనభ్యసించి డాక్టర్ పట్టాను పొందారు. ఇటు డాక్టరుగా రోగాలను కుదర్చడమూ, అటు సంగీత విద్వాంసునిగా సంగీత స్వరరాగాలను కూర్చడంలోనూ అసమాన ప్రతిభా సంపన్నుడై, రెండు రంగాల్లోనూ సాటిలేని మేటిగా పేరు తెచ్చుకున్నారు. రోగుల రుగ్మతను గ్రహించి చికిత్స చేయడంలోనూ, సంగీతాభ్యాసన ఆసక్తిని గ్రహించి, శిష్యులను విద్వాంసులుగా తయారుచేయడంలో ఉభయశాస్త్ర ప్రవీణత్వం సాధించారు. డాక్టరుగా ఆయన హస్తవాసి గొప్పదని రోగులూ, సంగీత బోధకునిగా 'రాశి' కలవాడనీ ఆయన శిష్యులూ ఇరు రంగాల్లోనూ అనన్య పేరు ప్రఖ్యాతులను సంపాదించిననూ, ఆయనకు కించిత్తు గర్వముండెడిది కాదనీ, వినయంలో వెండి కొండంత స్థాయి కెదిగినా, ఒదిగే ఉండేవారని వారితో పరిచయం గల వారనేవారు.

సాంప్రదాయ సంగీతం పట్ల వారికున్న గౌరవం అపారం. సంగీతం నేర్పమని వచ్చేవారికి ప్రాణమిచ్చేవారు. స్వస్థాన రాగస్వరూపం, విరూపమైపోతుందనే బాధ, బెంగ వారికెక్కువగా ఉండేది. అపస్వరం దొరలకుండా తన శిష్యుల సాధనలో జరగకుండా ఘట్టి శ్రద్ధ తీసుకుంటుండేవారు. తమిళ దేశంలో త్యాగరాజ సంగీతబద్ధ స్వరాలను సంగీత విద్మణులెలా, రాగసాంప్రదాయాన్ని, లయ విన్యాసాలను పాటించేవారో తానలానే పాటిస్తూ, తన శిష్యులను అలాగే తీర్చిదిద్దిన ఘనత శ్రీపాద పినాకపాణిగారిదే! కర్ణాటక సంగీతంలోని ప్రతీ సంగతినీ, శబ్దస్వరాన్నీ, సాహిత్యదన్నుకు భిన్నం రాకుండా, స్వరలిపి (నొటేషన్)నూ రాసుకొనేవారు. జనకరాగాలను సహితమూ ఆయన గొంతెత్తి పాడుతున్నప్పుడు,

## శత సంవత్సర సంగీత (వి)శారదుడు - తొమ్మిది దశాబ్దాలకు పైగా కర్ణాటక సంగీత సేవలో పునీతుడు

# డా॥ శ్రీపాద పినాకపాణి!

### - త్యాగరాజును తెలుగువాకిట సంగీతరాజుగా నిలిపిన శ్రీవాణీ గిరిజాశ్చ్యుడు!! -

### అధ్యయనం చేసిన వైద్యశాస్త్రంతో రోగాలను కుదిర్చారు!

### అభ్యాసం చేసిన కర్ణాటక సంగీతంతో తెలుగు వాకిట త్యాగయ్య కృతులను నింపారు!!



ఉన్నతమైన సంగీత సాంప్రదాయం, ఉదాత్తమైన లయ గుభాళిస్తుండేది. రమారమిగా తొమ్మిది దశాబ్దాల పాటు కర్ణాటక సంగీతం (వీనులకు విందైన సంగీతం)తో, స్వరస్థాయి, గమకాలనధ్యయనం చేసిన శిష్యులతో వారు సాహసం చేసారు. సంగీత సౌరభం, స్వరారామం, పాణినీయం, నా సంగీత యాత్ర – అనే గ్రంథాల నెన్నిటినో రచించారు.

సంగీత విద్మణులైన నూకల చిన సత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, మల్లాది సూరిబాబు వంటి మహావిద్వాంసులు శ్రీపాద పినాకపాణి శిష్యులమని ఘనంగా, గౌరవంగా, గర్వంగా చెప్పుకుంటారు. ఆయన అపర త్యాగరాజు. మన తెలుగువాడుగా పుట్టి, కర్ణాటక సంగీత తెలుగు రా(గ)రాజుగ మన మధ్యనే ఉంటూ, ఇటీవల శతవర్ష హర్ష పండుగను ఆయన శిష్యులూ, అభిమానులూ జరుపడం 'శతగానంభవతి' అంటూ ఆయన ఇంకో వందేండ్లు పూర్ణ ఆరోగ్య సంపదలతో వర్ధిల్లాలని కోరుకోవడం మరో గర్వకారణం.

**తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారీ, సంగీత ప్రియుడైన మాన్యశ్రీ ఎల్వీ. సుబ్రహ్మణ్యం ఐ.ఎ.ఎస్. తిరుమల తిరుపతి దేవస్థానములూ, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖల తరపున (అనారోగ్యంతో మంచమ్మీద ఉన్ననూ తన శతవర్ష జన్మదిన పర్వ పరువపు సందర్భమున సన్మానిస్తూన్నప్పుడు కూడా పెదవుల మధ్యగా పల్లవించిన కర్ణాటక సంగీత స్వరాన్ని బుల్లితెరపై చూపారు) స్వయంగా ఎల్వీ సుబ్రహ్మణ్యం కర్నూలు వెళ్ళి, ముకుళిత హస్తాలతో పదిలక్షల వెయ్యి నూట పదహారులను యిచ్చి, ఆయన స్వర్ణ హస్తాలను స్పృశించడం, అస్మదీయుల హృదయాలను ఆనందకందితుల్ని చేసింది. ఈ సందర్భంలో ఆయన కుటుంబ సభ్యులు, శిష్య ప్రశిష్యులుతోబాటు శివాంశసంభూతులు, సంగీతారాధకులు, సద్గురు కందుకూరి శివానందమూర్తి మహోదయులుండటం మహదానందదాయకమైంది. ఇంత ఘనత, సంగీత ప్రవీణత, వైద్యరాజవిభవమూర్తియైన, శతవర్ష పూర్ణ శశాంకమూర్తి డా॥ శ్రీపాద పినాకపాణి కర్నూలు నగరంలో ఉన్నట్టు పలువురు సంగీత అభిమానులకు ఎరుకయే లేదు. చాన్నాళ్ళుగా అనారోగ్యంగా మంచము పట్టి ఉన్నారని కూడా ఎరుగరు. వారు తిరుమల శ్రీనివాసుని అనుగ్రహంతో పూర్ణ ఆరోగ్యమును పొంది, మరో వంద సంవత్సరాలు జీవించాలని ప్రముఖాంధ్ర కోరుకుంటూన్నది.** ●



# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

81

## పండ్రెండవ అధ్యాయము - భక్తి యోగము

**1. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః**

**వ్యాఖ్య :** 'ఏవమ్' అను పదము క్రిందటి అధ్యాయము యొక్క 55వ శ్లోకమగు 'మత్కర్మకృత్' అను శ్లోకము యొక్క భావమును సూచించుచున్నది.

భగవానుని విశ్వరూపమునుగాని, లేక దైవసందబంధమైన వేఖౌకమూర్తినిగాని, సాకార స్వరూపమునుగాని, అనవరత భక్తితో, ఉపాసించువారు (సగుణోపాసకులు) గొప్పా? లేక ఇంద్రియములకు గోచరముకాని, నిరాకారమైన, సర్వవ్యాపకమైన, అక్షర పరమాత్మను ధ్యానించువారు (నిర్గుణోపాసకులు) గొప్పా? అని అర్జునుని ప్రశ్న. ఇదివఅలో అనేకమార్లు భగవానుడు (2వ అధ్యాయము 8వ అధ్యాయము మున్నగుచోట్లు) నిర్గుణ పరమాత్మ యొక్క తత్త్వమును గూర్చి, ధ్యానమును గూర్చి తెలిపియుండిరి. ఇప్పుడు విశ్వరూపమునుజూపి, సుగుణోపాసనను బలపఅచిరి. కావున రెండింటిలో ఏది శ్రేష్ఠమను భావము అర్జుననకు కలుగుట సహజమే అయియున్నది –

**2. మయ్యావేశ్య మనో మే మాం నిత్యయుక్తా ఉపాసతే**
**శ్రద్ధయా పరయోపేతా స్తేమే యుక్తతమా మతాః.**

**వ్యాఖ్య :** అర్జునుని ప్రశ్నకు భగవానుడు చక్కటి సమాధానమొసంగిరి. సుగుణోపాసకులు శ్రేష్ఠులా? నిర్గుణోపాసకులు శ్రేష్ఠులా? యను ప్రశ్నకు ఎవరైనను సరియే మిక్కిలి శ్రద్ధతో గూడుకొని నిరంతరము దైవాయత్తచిత్తులైయుందురో వారే శ్రేష్ఠులని శ్రీకృష్ణుడు ప్రత్యుత్తరమొసంగిరి. ఇచట మూడు సాధనలు చెప్పబడెను.

(1) మనస్సును పరమాత్మయందు నిలుపుట.

(2) నిరంతరము దైవచింతనాపరులై యుండుట.

(3) మిక్కిలి శ్రద్ధతో గూడుకొనియుండుట.

ఈ మూడింటిని అనుష్ఠించువాడెవడో అతడు సర్వశ్రేష్ఠుడగు యోగిగాని, సగుణోపాసకుడా, నిర్గుణోపాసకుడా, సన్న్యాసియా, గృహస్థుడా, ద్విజుడా, ద్విజేతరుడా – అను ప్రశ్నయే ఇచట లేదు. ఆహా! భగవాను డెట్టి విశాల భావమును ప్రకటించిరి! భక్తికి, శ్రద్ధకు, ఏకాగ్రతకు, ప్రాధాన్యమొసంగిరే కాని ఒకానొక మార్గమునకు, సంప్రదాయమునకు గాదు.

**3. యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే**
**సర్వత్రగమచిన్త్యం చ కూటస్థమచలం ధ్రువమ్**

**4. సంనియమ్యేన్ద్రియ గ్రామం సర్వత్ర సమబుద్ధయః**
**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః.**

**వ్యాఖ్య :** ఒకే పరమాత్మ సాకారముగను, నిరాకరముగను ఉండుటవలన, సగుణ ధ్యానమునకుగాని, నిర్గుణ ధ్యానమునకు గాని లక్ష్యము ఒకటియే అయియున్నది. శ్రద్ధతోను, నిర్మలభక్తితోను ఏ ప్రకారము ధ్యానించినను జనులు పరమాత్మనే చేరుదురు. ఈ రెండు శ్లోకములందును నిర్గుణపరబ్రహ్మమును ధ్యానించువారిని గుఱించి చెప్పబడినది. ఇందు మొదటి శ్లోకమున బ్రహ్మమును గూర్చిన విశేషణములున్ను, రెండవ శ్లోకమున బ్రహ్మప్రాప్తికి వలసిన శీలసంపత్తియు తెలుపబడినవి. సాధకుడు సాధ్యవస్తువగు పరమాత్మను ధ్యానించుచున్నప్పటికిని, హృదయశుద్ధి లేనిచో, ఇంద్రియ నిగ్రహము గల్గియుండనిచో, ప్రాణికోటి యెడల దయలేనిచో ఆ ధ్యానము చక్కని ఫలితము నొసంగజాలదు. అట్టి వానికి బ్రహ్మానుభూతి కలుగుట దుస్తరము. అతని ఉపాసన కళాయిలేని పాత్రలో వండిన పప్పుపులుసువలె నుండును. వస్తువులన్నియు మంచివి అయినను పాత్ర శుద్ధముగా లేనిచో ఆ పులుసెట్లు చిలుమెక్కిపోయి నిరుపయోగమగునో, అట్లే హృదయశుద్ధి, ఇంద్రియ నిగ్రహము, భూతదయ మున్నగు పవిత్ర గుణములు లేక భగవంతుని నిరాకారమునగాని, సాకారముగగాని యెట్లుపాసించినను పూర్ణఫలితము కలుగదు. కనుగనే గీతాచార్యులు ధ్యానశీలురను హెచ్చరించుటకు కాబోలు, ధ్యాతకు వలసిన మూడు గొప్ప సుగుణములను ఇచట నిర్గుణబ్రహ్మోపాసనా ఘట్టమున పేర్కొనిరి. అవి యేవియనిన –

(1) ఇంద్రియ సమూహమును లెస్సగ అరికట్టుట (సంనయమ్యేన్ద్రియ గ్రామం)

(2) ఎల్లెడల సమభావము గలిగియుండుట (సర్వత్రసమబద్ధయః)

(3) సమస్త ప్రాణులకు హితమునాచరించుట (సర్వభూతహితేరతాః)

కాబట్టి ముముక్షువులు ధ్యానాదులను సల్పుచు ఈ సుగుణత్రయమును అలవఅచుకొనవలెను. ఇచట 'నియమ్య' అని చెప్పక 'సంనియమ్య' అని చెప్పుటవలన ఇంద్రియములను ఒకింత నిగ్రహించిన చాలదనియు లెస్సగ నిగ్రహించవలెననియు, 'సర్వత్ర' అని పేర్కొనుటవలన సమస్త ప్రాణులందును, లేక ఎల్లకాలమందును సమభావము గలిగియుండవలెననియు, 'సర్వభూతహితేరతాః' అని చెప్పుటచే ఏ ఒకానొక ప్రాణియెడల దయగలిగియుండుట చాలదనియు, సమస్త ప్రాణికోట్ల యెడ ప్రేమ, దయ, ఉపకారబుద్ధి గలిగియుండవలెననియు స్పష్టమగుచున్నది. ఈ ప్రకారములగు సుగుణములు గల్గి పరమాత్మను ధ్యానించుచో వారు తప్పక ఆ పరమాత్మను జేరగలరని 'తేప్రాప్నువన్తి' అను వాక్యముచే భగవానుడు నిశ్చయపూర్వకముగ తెలుపుచు సర్వులకును అభయమొసంగుచున్నారు. కావున భగవద్ధ్యానపరుడు పై మూడు సుగుణములను తనయందున్నవా, లేవాయని పరీక్షించుకొనవలయును.

**5. క్లేశోఽ ధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే.**

**వ్యాఖ్య :** నిర్గుణోపాసనామార్గము దేహాభిమానముగలవారికి చాలా ప్రయాసగా నుండునని యిచట తెలుపబడినది. అది లేనివారికి చాల సులభముగనుండును. అనగా దేహాహంభావములేక, ఇంద్రియనిగ్రహముగలిగి, నిష్కామకర్మానుష్ఠానము చేతను, ఈశ్వరోపాసనచేతను చిత్తశుద్ధిని బడిసినవారికి నిర్గుణోపాసనయందేమియు కష్టముండదు. ఈ శ్లోకము యొక్క మొదటి పాదమునందు నిర్గుణోపాసన అధికతరక్లేశవంతమై యుండునని చెప్పుట దేహాభిమానముగలవారికే యనియు, ఇంద్రియ నిగ్రహము లేనివారికే యనియు, సుగుణోపాసనచే చిత్తశుద్ధిని బడయనివారికే యనియు గ్రహించవలెను. దేహాభిమానము లేనివారికి, ఇంద్రియ నిగ్రహము కలవారికి నిర్గుణ మార్గము అతి సులభముగనున్నదై జీవుని పరమాత్మ సాన్నిధ్యమునకు తప్పక చేర్పగలదని వెనుకటి శ్లోకములందు భగవానుడు చెప్పియే యుండిరను విషయమును ఈ సందర్భమున జ్ఞాపకమునకు తెచ్చుకొనవలెను.

– (తరువాయి వచ్చే సంచికలో)